క్లుప్తంగా

షిర్డీ సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయినాథుడు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గల సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. మార్గశిర మాసం సందర్భంగా నిర్వహించిన పూజల్లో భాగంగా ఉదయం 6 గంటలకు బాబాకు హారతి పూజలు నిర్వహించారు. అనంతరం బాబాకు విభూది, పంచామృతాలు, సుగంధ పుష్పాలతో అభిషేకాలు చేపట్టారు. పట్టు వస్త్రాలు, ఆభరణాలు అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 10 గంటలకు స్థానికంగా ఉన్న భక్తులు బాబా భజనలు చేశారు. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సాయంత్రం బాబాకు పల్లికీ సేవ, హారతి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పారిశ్రామిక ప్రాంత భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సాయినాథునికి పూజలు చేశారు.

15న మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేంద్ర, మధు తదితరులు

పెదగంట్యాడ : ఇండియన్ నేవీ డేను పురస్కరించుకుని ఈ నెల 15న ఏఎస్ఆర్ హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో బీసీ రోడ్డు మార్వెల్ స్కూల్ వెనుక మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని ట్రస్ట్ ఫౌండర్ ఎ.నరేంద్ర తెలిపారు. ఈ మేరకు నెహ్రూనగర్ జంక్షన్‌లో గురువారం గ్రామ కమిటీ అధ్యక్షుడు శరగడం మధు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కనీసం కొంత మంది ప్రాణాలైనా కాపాడాలని శిబిరంలో వెయ్యి మందితో రక్తదానం చేయించాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని, అందరూ సహకరించి పెద్ద సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మనోజ్, ఆర్పీ నాయుడు, గురునాథ్‌రెడ్డి, భరత్‌కుమార్, రంజిత్, సునీల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ వాల్ నిర్మాణం

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు రామకృష్ణానగర్‌లో ఇటీవల వర్షాలకు కొండ చరియలు విరిగిపడడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ పనులను గురువారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులను రూ. 1.30 కోట్లతో నిర్మిస్తామన్నారు. ఇది 35 మీటర్ల మేర ఉంటుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రనగర్ రెవెన్యూ సదస్సుకు పలు అర్జీలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సదస్సుకు హాజరైన స్థానిక ప్రజలు తమ సమస్యల్ని అధికారులకు నివేదించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ సమ్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పలు దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ బైక్‌లు.. దొంగలపాలు



శ్రీహరిపురం నుంచి హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వరకు గల సేవా మార్గంపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

ఉపాధి కోసం వచ్చే పలువురు ద్విచక్ర వాహన చోదకుల వాహనాలు ఆయా సంస్థల వద్ద అదృశ్యమవుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుండటంతో వారు లబోదిబో మంటున్నారు. కార్మికుల వాహనాలకు పార్కింగ్ స్థలం కల్పించాల్సిన యాజమాన్యాలు చేతులెత్తేస్తుండటంతో వాహనాల యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- పార్కింగ్ స్థలం లేక సేవా మార్గాల్లోనే వాహనాల నిలుపుదల
- సులువుగా చేతివాటం ప్రదర్శిస్తున్న దొంగలు
- కార్మికులకు పార్కింగ్ స్థలం ఇచ్చేందుకు సంస్థల నిరాసక్తత

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ)లోని కాంట్రాక్టర్ల వద్ద పలువురు టెక్నీషియన్లుగా, కలాసీలుగా, హెల్పర్లుగా పని చేస్తున్నారు. వీరంతా పరవాడ, అనకాపల్లి, రాంబిల్లి, గాజువాక, కూర్మన్నపాలెం, నగరంలోని డాబాగార్డెన్స్, సీతమ్మధార, మధురవాడ తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇలా వచ్చే వారి సంఖ్య దాదాపు రెండు వేల వరకు ఉంటుంది. నిజానికి వీరికి సంస్థ యాజమాన్యం పార్కింగ్ స్థలం కేటాయించాల్సి ఉంది. కానీ సంస్థ పట్టించుకోకపోవటంతో కార్మికులు తమ ద్విచక్ర వాహనాలను హెచ్‌పీసీఎల్ ఎదురుగా ఉన్న సేవా మార్గంలో పార్కింగ్ చేసుకుని హడావిడిగా విధులకు వెళ్తుంటారు. తీరా వారు విధుల నుంచి సాయంత్రం లేదా రాత్రి వచ్చేసరికి వారి ద్విచక్ర వాహనాలు అదృశ్యం అయిపోతున్నాయి. దీంతో వారు పోలీసులను ఆశ్రయించాల్సి వస్తోంది. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో సుమారు 5కు పైగా ద్విచక్ర వాహనాలను దొంగలు తస్కరించారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మైనర్‌లే దొంగతనాలు చేస్తున్నారా..

హెచ్‌పీసీఎల్, డాక్‌యార్డ్ వంటి పరిశ్రమల ముందు అదృశ్యమైన ద్విచక్ర వాహనాలను మైనర్లే దొంగిలించినట్టు మల్కాపురం క్రైమ్ పోలీసులు గుర్తించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ వారు డబ్బుల కోసం దొంగతనాలు చేస్తున్నట్టు తెలిపారు. దొంగిలించిన వాహనాల్లో కొన్నింటిని ఇటీవల రికవరీ చేశామని క్రైమ్ పోలీసులు తెలిపారు.

తగ్గని చోరీలు..

గడచిన రెండు నెలల్లో ఏఎస్ఆర్‌కాలనీ వద్ద ఓ ఆటో, మూడు రోజుల క్రితం ఎంఐజీ కాలనీలో రెండు లక్షలు విలువ చేసే ఓ ద్విచక్ర వాహనం దొంగిలించారు.

సీసీ కెమెరాలు ఉండాలి..

హెచ్‌పీసీఎల్ నుండి శ్రీహరిపురం.. అటు మల్కాపురం వరకు గల సేవా మార్గాలపై ఆధునిక టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాహనాల దొంగలను సులువుగా గుర్తించవచ్చని పలువురు అంటున్నారు. దీనిపై క్రైమ్ పోలీసులు తక్షణ చర్యలు తీసుకుంటే బాగుంటుందని చెబుతున్నారు.



కొత్త హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి యారాడ పార్కుకు వెళ్లే సేవా మార్గంపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

ట్రాఫిక్ సమస్యలు..

సేవా మార్గంపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో మల్కాపురం, శ్రీహరిపురం కూడలి వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. గంటల తరబడి వాహన చోదకులు గమ్యస్థానాలకు చేరుకోలేక ఇక్కట్ల పాలవుతున్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి..



దూర ప్రాంతాల నుండి హెచ్‌పీసీఎల్‌కు ద్విచక్ర వాహనాలపై వచ్చే వారికి సంస్థ యాజమాన్యం పార్కింగ్ స్థలం కేటాయించాలి. కానీ వారు ఇలాంటి చర్యలు చేపట్టకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను దొంగిలిస్తున్నారు. తక్షణం యాజమాన్యం ఈ సమస్యపై స్పందించాలి.

– పుర్రె అప్పారావు యాదవ్, శ్రీహరిపురం

ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి..



సేవా మార్గంపై ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండటం వల్ల మల్కాపురం, శ్రీహరిపురం, ఆర్‌కేపురం, యారాడ పార్కు వంటి కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పనుల కోసం వచ్చే వారికి పార్కింగ్ స్థలం కేటాయిస్తే రోడ్డుపై వాహనాలు పార్కు చెయ్యరు. తద్వారా ట్రాఫిక్ సమస్య ఉండదు.

– నూకరాజు, మల్కాపురం

ఓటర్ల నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం



జెడ్సీ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం: నియోజకవర్గం పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువత నూతన ఓటు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమీపంలో గల సచివాలయంలో కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు కోసం దరఖాస్తు నింపి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, ఫొటో జత చేసి అందించాలన్నారు. ఓటర్ కార్డులో చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేరే నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి చిరునామా మారిన ప్రజలు ఓటర్ కార్డులో చిరునామా మార్పు కోసం డిసెంబర్ 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన ఓటర్ల ఇంటికి బీఎల్‌వోలు వెళ్లి విచారణ చేశాక ఓటర్ కార్డులు జనరేట్ అవుతాయని, వారం రోజుల తర్వాత నెట్ సెంటర్‌లో కార్డు ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుందని జెడ్సీ రాము తెలిపారు.

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాలి

గోపాలపట్నం: యాదవ రిజర్వేషన్ పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సింహాద్రినగర్‌లోని నమ్మి అప్పలరాజు ఇంటి ప్రాంగణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ చైర్మన్ నమ్మి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రాలో యాదవులు విద్యా, ఉద్యోగం, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబాటుకు గురయ్యారని అన్నారు.

యాదవులను బిసి–డి నుంచి బిసి–బికి మార్చాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల చనిపోయిన గొర్రెలు, మేకల కాపర్లకు నష్టపరిహారం ఇవ్వాలని, 50 ఏళ్లు నిండిన యాదవులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. యాదవ సంఘం నాయకులు, విద్యావంతులు హాజరు కావాలని కోరారు.

నిత్యం ఇదే నరకం



కాల్వలో చెత్త తొలగించేందుకు కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుడు

గోపాలపట్నం: నిత్యం ఇదే నరకం చవిచూస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉదయం వేళల్లో గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద గల ఖజానా బంగారు దుకాణం పరిసరాల్లో మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఈ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. నడిచేందుకు వీలు కాని పరిస్థితి తలెత్తుతోంది. జీవీఎంసీ సిబ్బంది వచ్చి ఇక్కడి కాల్వలో మురుగు నీరు వెళ్లేందుకు తీవ్రంగా కష్ట పడినా ప్రయోజనం లేకపోతోందని ఇది చూసిన వారు వాపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ఇక్కడి కాల్వకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. బీఆర్‌ఈఎస్ దక్షుల్లో వ్యర్థాలు అడ్డు ఉండిపోవడం, ఇక్కడి రహదారి కల్వర్టు ఎత్తు తక్కువగా ఉండడం వంటి సమస్యల వల్ల ఈ ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యని పరిష్కరించాలని కోరుతున్నారు.

గిరిజనులకు నృసింహ దీక్ష వస్త్రాల పంపిణీ



గిరిజనులకు దీక్ష వస్త్రాలు అందిస్తున్న సింహాద్రి మఠం గురుస్వామి సురేంద్ర

సింహాచలం: ఏజెన్సీ ప్రాంతాల్లో గురువారం 32 రోజుల శ్రీనృసింహ దీక్షలు తీసుకున్న గిరిజన దీక్షాధారులకు సింహాచలంలోని సింహాద్రి మఠం గురుస్వామి కోరెడ్డి సురేంద్ర దీక్ష వస్త్రాలు అందించారు. అరకులోని లోతేరు రోడ్డులో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం, ముంచంగిపుట్ రామాలయం, జీకే వీధి మండలం ఏబులంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం, చింతపల్లి మండలం బొంగూడ గ్రామంలోని ఆలయంలో దీక్షలు తీసుకున్న సుమారు 650 మంది గిరిజనులకు ఈ వస్త్రాలను ఉచితంగా అందించారు. పురుషులకు పంచె, కండువా, చొక్కా పీస్, మహిళలకు చీర, కండువా ఇచ్చారు.

స్టోరేజీ ఓటీ రద్దు దారుణం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న యూనియన్ నాయకులు

గోపాలపట్నం: దేశవ్యాప్తంగా నేవల్ సివిల్ ఉద్యోగులు గురువారం విక్టమైజేషన్ వ్యతిరేక దినాన్ని పాటిస్తున్నారని ఎన్ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఎన్ఏడీ గేటు వద్ద కార్మికులకు కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్టమైజేషన్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రూప్ సమావేశాలు, బైక్ ర్యాలీలు, నిరసనలు నిర్వహించామన్నారు. ఎన్ఏడీ యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడి కేసులు పెట్టడం, సస్పెండ్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతోందని అన్నారు. 20 ఏళ్లుగా స్టోరేజీ ఓటీ ఇస్తున్న ఎన్ఏఈ యాజమాన్యం ఇప్పుడు రద్దు చేయడం దారుణమన్నారు. దీని గురించి అడిగితే ఆరుగురు కార్మికులపై అక్రమంగా కేసులు పెట్టారని, 36 మంది కార్మికుల్ని సస్పెండ్ చేశారని అన్నారు. సీజీఎం చర్యలు హేయమైనవని దుయ్యబట్టారు. యాజమాన్యం దిగిరాకపోతే తమ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఇతర యూనియన్లు తమకు మద్దతు ఇస్తున్నాయని, వారందరినీ కలుపుకుని నిరాహార దీక్షలు, వంటా వార్పు వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖలో కార్మికులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో క్రీడా సంబరాలు



క్రీడలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి సూర్యప్రతాప్



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం–1లో గురువారం 50వ వార్షికోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యాలయ మేనేజ్‌మెంట్ నామినీ చైర్మన్ కమాడోర్ సూర్యప్రతాప్, ప్రిన్సిపాల్ జి.కిషోర్ పాల్గొని క్రీడా వార్షికోత్సవ జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా సూర్యప్రతాప్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి ఉత్సాహం, పోరాట పటిమను పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోరాట పటిమను ఇనుమడింపజేయడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా, కరాటే, బనానా రేస్, డ్రిల్ తదితర అంశాలు ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో అండర్–14, అండర్–17లో హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమత్ వ్రతం

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతాన్ని విశేషంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి పంచామృతాభిషేకాలు, 7.30 నుంచి లక్ష తమలపాకుల పూజ, 9 నుంచి పట్టాభిషేక పారాయణం, 9.30 నుంచి విశేష హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్సిందిగా ఏఈవో ఆనంద్‌కుమార్ కోరారు.

వైభవంగా నూకాలమ్మ తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు



ఆలయం వద్ద బారులు తీరిన మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో వెలసిన నూకాలమ్మ తల్లికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో తొలి పూజ చేశారు. ఆలయాల పవిత్రతను అంతా కాపాడుకోవాలని అన్నారు. గ్రామ దేవతలను నిష్ఠగా ఆరాధిస్తే ఆ గ్రామానికి ఎటువంటి కీడు రాదని భక్తుల విశ్వసం అన్నారు. గ్రామంలో గల యువత దైవ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గోవాలన్నారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్, బీజేపీ నాయకుడు పాలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల మార్గం



గంగవరం రోడ్డు మలుపులో దూసుకొస్తున్న భారీ వాహనాలు

- గంగవరం రోడ్డులో నిత్యం ప్రమాదాలు
- అతి వేగంగా దూసుకొస్తున్న భారీ వాహనాలు
- భయాందోళనలో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు

పెదగంట్యాడ : గంగవరం రోడ్డులో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. దీంతో గంగవరం రహదారి గుండా ప్రయాణం చేయాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకుంటోంది. పెదగంట్యాడ నుండి గంగవరం వైపు వెళ్లే రహదారిలో వెంకన్నపాలెం కూడలి వద్ద ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనచోదకులు, పాదచారుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు గంగవరం పోర్టు, ఇంకోవైపు మత్స్యకారులు నివాసం ఉండే అనేక కాలనీలు, మరోవైపు ఆటో నగర్‌కు చెందిన అనేక పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అందువల్ల ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, వ్యాపార లావాదేవీలు, ఇతర కూలి పనుల నిమిత్తం గాజువాక వచ్చి వెళ్లే కాలనీవాసులు నిత్యం అదే రహదారి గుండా ప్రయాణం చేస్తూ ఉంటారు. అంతేకాకుండా ఆ కూడలి వద్దకు వెళ్లే వాహన చోదకులు ఎవరు ఎటునుండి వస్తున్నారో తెలియక గందరగోళ పరిస్థితి నెలకుంటోంది. దీంతో ఒకరినొకరు ఢీకొనడం, గాయాలపాలవడం షరా మామూలుగా మారిపోయింది. దీనికి తోడు గంగవరం పోర్టులో వేలాది మంది ఉద్యోగులతో పాటు వివిధ సరకులు రవాణా చేసే వాహనాలు కూడా అధిక సంఖ్యలో ప్రయాణం చేయడం వల్ల మరిన్ని ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. ఇక్కడ వేగ నియంత్రణ చర్యలు చేపట్టపోవడంతో భారీ వాహనాల వేగానికి అడ్డూ అదుపూ లేకుండాపోతోందని అంటున్నారు, ఇప్పటికైనా పోలీసులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పారిశ్రామిక ప్రాంతంలో గత రెండు రోజల నుంచి పగటి పూట పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 9 గంటలైనా ఎక్కడా సూర్యకాంతి కనిపించటం లేదు. ముఖ్యంగా సేవా మార్గాల్లో పొగ మంచు వ్యాపించటంతో పగటి పూట కూడా వాహన చోదకులు హెడ్‌లైట్లు వేసుకోవాల్సి వస్తోంది.

- మల్కాపురం

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపై ఉన్న ఇనుప స్తంభం

విశాఖ విద్య: గోపాలపట్నం బాజీ జంక్షన్ నుంచి ఎన్ఏడీకి వచ్చే బీఆర్‌టీఎస్ రహదారిలో ఫ్లైఓవర్ వద్ద రోడ్డు పక్కన ఉన్న ఇనుప స్తంభం ప్రమాదభరితంగా ఉంది. ఫ్లైఓవర్ కిందకు భారీ వాహనాలు రాకుండా నియంత్రించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. అయితే ఓ పక్కన ఉన్న స్తంభం ఇప్పటికే విరిగిపోవటంతో దాన్ని తొలగించారు. మరో పక్క ఉన్న ఇనుప స్తంభం అలాగే ఉంది. రాత్రి వేళల్లో ఇది సరిగ్గా కనిపించకపోవటంతో వాహన చోదకులు దీన్ని ఢీకొనే పరిస్థితులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి, నిరుపయోగంగా ఉన్న దీన్ని తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.